# మా చిట్టి చంద్రహారం

అర్జున్

మా నాన్నకు మాకంటే మా చెల్లి చిట్టిఅంటే చాలా గారాబం. ప్రేమ. ముద్దు లాలిస్తే చిట్టిబుగ్గలను చూస్తేగాని మా నాన్నకు సంతృప్తిగా వుండేదిగాదు. చిట్టి మానాన్నకు ఎంత గారాబం అంటే లేకలేక రాజుగారికి పుట్టిన కుమార్తెకు జరిగే సకలసపర్యలు జరిగేవి. ఇంటికి ఏం తెచ్చినా ముందు చిట్టికి తరువాత మాకు. మా అన్న ఆనందుగూడ అంతే! ఎప్పుడుచిట్టి! చిట్టి అని దాన్నే దగ్గరకు పిలిచి ఎత్తుకునే వాడు గాని, ఏరా! రఘు! యిలారా! అని నన్ను పిలిచిన పాపానపోలే అదేమయ్యా అంటే "అది చిన్నపిల్లరా! నీకేరా పదిసంవత్సరాలునెత్తికొచ్చాయి." అనేవాడు. చిట్టిమటుకు మహాచిన్నదేం? దానికి ఆరుసంవత్సరాలు. ఇలా వుండగా ఒకసారి మా నాన్న మద్రాసు వెళ్లాడు. వెళ్లేముందు చిట్టి నాన్నవద్దకు వెళ్లి "నాన్నా! నేను నీతో వస్తా" అంటూ మారాం చేసింది.

"లేదు చిట్టి! నా మంచి తల్లివిగా! నీవు వద్దమ్మా! మరోసారి తీసుకువెళతాలే! ఆఫీసు పనిపై చాలా తొందరగా వెళ్లి రావాలి" అని బుజ్జగించి చెప్పాడు.

"హుఁ! హుఁ!" అని మరీ గోముచేసింది చిట్టి!

"నీకు మంచి సిల్కుగౌన్లు, పరికిణీలు, దండ తెచ్చియిస్తానమ్మా!" అని నాన్న దానికి ఏదో కల్లబొల్లి కబుర్లు చెప్పి మద్రాసు వెళ్లాడు. చిట్టి మహా మురిసిపోయింది నాన్న తనకు సిల్కుగౌన్లు తెచ్చియిస్తాడని. ఆ విషయం తన స్నేహితురాలగు అమ్మడికి పనిగట్టుకువెళ్లి చెప్పివచ్చింది.

నాన్న మద్రాసులో ఆఫీస్ పని ముగించుకుని తిరిగి వచ్చేటప్పుడు మంచి చంద్రహారం ఒకటి తీసుకొని వచ్చాడు చిట్టికి. చిట్టి దాన్ని చూసి మురిసిపోయింది. ఆ హారాన్ని ఎప్పుడూ మెడలో వేసుకొని తిరుగుతూవుండేది. అమ్మ "జాగ్రత్తగా వుండవే!" అని హెచ్చరిస్తుండేది. ఆ హారాన్ని చూచినవాళ్లంతా "అబ్బ ఎంత చక్కగా వుంది. కండ్లు మిరిమిట్లు గొల్పుతున్నాయి" అనేవారు. ప్రతివాళ్లు తన చంద్రహారాన్ని ఆ విధంగా మెచ్చుకొనేసరికి చిట్టి కన్నులు ఆనందంతో మెరిసిపోయేవి.

ఇలావుండగా దసరా పండుగ వచ్చింది. నేను, అన్నయ్య అంతా శలవులు గనుక ఇంటివద్ద తిష్టవేశాము. ఒకరోజు చిట్టి పక్కింటి అమ్మడిని పిలిచి "బొమ్మలాట ఆడుకొందాం రమ్మంది." అమ్మడికి చిట్టి వయస్సే. ఎంతో ముచ్చటగా వుండేది వాళ్ల స్నేహం. అమ్మడు, చిట్టి ఎవరిబొమ్మలు వాళ్లు తెచ్చుకొని మా మేడపైకి వెళ్లి ఆటలాడుకొ మొదలుపెట్టారు. వాళ్లు ఆడుకొనేవైపు మా మేడపైకి వేపచెట్టు కొమ్మలు ప్రాకివున్నాయి. ఆ చెట్టుపై కోతులు గంతులు వేస్తూవుంటాయి.

అమ్మడు, చిట్టి కలసి కొంతసేపు అలా ఆటలాడుకొన్నారు. చిట్టి తన చంద్రహారం బొమ్మమెడలోవేసి దాని అందచందాలకు ఎంతో ఆనందించింది. ఇంతలో క్రిందనుండి అమ్మ ఓసారి వచ్చివెళ్లమని కేకవేసేసరికి అమ్మడితో "బొమ్మలను భద్రంగా చూస్తుండ"మని చెప్పి క్రిందికి వెళ్లింది చిట్టి. అమ్మడు తన బొమ్మలకు కావలసిన శృంగారాలు, సవరింపులు చేసుకుంటూ ఆ పనులలో మునిగిపోయింది! ఇతర విషయాలు ఏమీ గమనించకుండా! అంతవరకు మర్రి చెట్టుపై ఒక కోతి వీళ్ల ఆటలు చూస్తుండింది. చిట్టి క్రిందికి వెళ్లగానే మేడపైకి వచ్చి చిట్టి బొమ్మమెడలో వ్రేలాడే చంద్రహారాన్ని యిట్టే తీసుకొని క్షణంలో చెట్టుపైకి వెళ్లిపోయింది. అమ్మడికి యీ విషయం ఏం తెలియదు పాపం! తన బొమ్మలు, తను తప్ప! ఓ అరగంట తరువాత చిట్టి మేడపైకివచ్చి "అమ్మ క్రిందికి రమ్మంటున్నాది! వెళతాను" అని తన బొమ్మను చూసేసరికి చంద్రహారం కాస్తా మాయమైపోయింది. చిట్టి అమ్మడినడిగింది "చంద్రహారం తీసుకొన్నావా?"

"ఏ చంద్రహారం! నీ చంద్రహారమా! నాకు తెలియదే" అంది అమాయకంగా అమ్మడు.

"హుఁ! హుఁ! నీవే పోగొట్టావే! నీవే తీసుకొన్నావు! చూడు మా

## ★ మా చిట్టి చంద్రహారం ★

నాన్నతో చెప్పి నిన్ను ఏం చేయిస్తానో" అంటూ ఏడుస్తూ క్రిందికి పోయింది చిట్టి.

అమ్మడికి చంద్రహారం మాయం కావడం చాల విచిత్రంగా వుంది. చిట్టి అన్న మాటలకు ఖిన్నురాలై ఇంటికి వెళ్ళి వాళ్ళ నాన్నతో జరిగిన సంగతి అంతా చెప్పింది అమ్మడు!

వాళ్ళ నాన్న సాయంకాలం మా యింటికి వచ్చి నాన్నతో ఈ విషయం వివరాలు అడిగి తెలుసుకొన్నాడు. మా నాన్నకు కూడా అమ్మడు చంద్రహారం దాచేస్తుందని నమ్మకం లేదు. నాన్న, అమ్మడు వాళ్ళ నాన్నను మేడపైకి తీసుకొని వెళ్ళి ఆ ప్రదేశం అంతా చూసాడు. ఎక్కడ చంద్రహారం కనుపించలేదు. అమ్మడు వాళ్ళ నాన్న దృష్టి మటుకు చెట్టుపై కూర్చుండి కిచకిచలాడే కోతిపై పడింది. ఒక్కసారి తలపంకించి "ఏమండీ! రావుగారు! రేపీపాటికి దొంగను పట్టి మీ చంద్రహారం యిచ్చేస్తానండి" అని చెప్పి వెళ్ళిపోయాడు. దొంగను ఎలా పట్టారా అని నాన్న నిర్ఘాంతపడిపోయారు. అమ్మడు నాన్న తిన్నగా యింటికి వెళ్ళి వాళ్ళ నౌకరును పంపి మా వీధి చివరనివున్న కోతుల రామయ్యకు కబురుచేశాడు. రామయ్య వచ్చి "ఏం బాబు! కబురు చేశారట" అనగానే "ఏం లేదోయి! రేపు పొద్దున ఓసారి నీ కోతులన్నీ తీసుకొని రావుగారింటి వద్దకు రా" పని వుంది! మంచి బహుమానం యిస్తాలే!" అన్నాడు. సరే అని రామయ్య వెళ్ళాడు. అమ్మడిని కేకేసి, తనతోపాటు వెంటబెట్టుకుని బజారుకు వెళ్ళి మా చిట్టి చంద్రహారం మాదిరి యిమిటేషన్ పెరల్సు చంద్రహారాలు నాలుగు ఖరీదుచేసి యింటికి తీసుకొని వచ్చాడు.

మరునాటి వుదయం రామయ్య తన 4 కోతులను వెంటతీసుకొని మా యింటికి వచ్చాడు. నాన్నకు, నాకు విషయం ఏం అర్థం కాలేదు. ఇంతలో అమ్మడు నాన్న వచ్చాడు. వస్తూనే రాముడిచేతికి యిమిటేషన్ చంద్రహారాలు యిచ్చి "ఓరే! ఆహారాలని కోతుల మెడలో వేయరా!" అన్నాడు. రామయ్య మొదట సంకోచించినా ఆవిధంగానే చేశాడు "ఇక యిపుడు వీటిని మేడపైకి తీసుకొని వెడదాం రండి!" అని నాన్నను, కోతులను తీసుకొని పైకి వెళ్ళాడు. "ఇంక ఆకోతుల కట్లు విప్పివేసేయి రామయ్యా!" అని వుత్తరువు చేశాడు. రామయ్య ఆవిధంగానే వాటి కట్లు విడిపించాడు. విడిపించడమే తడవుగా అవి పరుగెత్తుకు వెళ్ళి మఱ్ఱి చెట్టు ఎక్కి కూర్చున్నాయి. మొదటి కోతి కొత్తగా వచ్చిన కోతుల మెడల్లో హారాలు వుండడం చూచింది. పరుగుపరుగున చెట్టు మొదల్లో వున్న మఱ్ఱిచెట్టు తొఱ్ఱలో చేయి పెట్టి యిట్టే మేము చూస్తుండగానే చిట్టి చంద్రహారం తీసింది. ఇవతలకు తీసి తన మెడలో వేసుకొని మిగిలిన కోతులతోపాటు గంతులు వేయసాగింది. అమ్మడినాన్న ఆదృశ్యాన్ని నాన్నకు చూపాడు "అదుగోనండీ! అసలు దొంగ!" అని కోతిని చూపాడు. నాన్న ఆదృశ్యం చూసి ముక్కుమీద వేలువేసుకొన్నాడు. రామయ్య చటక్కున కోతినిపట్టి చంద్రహారం తెచ్చి యిచ్చాడు. అమ్మడిచేత చిట్టికి యిప్పించాడు అమ్మడి నాన్న. కోతుల రామయ్యకు అయిదురూపాయలు బహుమానంగా యిచ్చాడు అప్పటినుండి, అమ్మడు, చిట్టి ఎంతో అన్యోన్యంగా వున్నారు. ఇక కథ కవరులోకి, కలం జేబులోకి. ★

### "ఏలుబడి"
### పెద్ద కథ
### రచన: జి. పార్వతి

★

17-11-1954 వారపత్రిక మొదలు "వనితాలోకం" శీర్షికలో శ్రీమతి జి. పార్వతి రచించిన "ఏలుబడి" అను పెద్ద కథ ప్రచురించబడుతుంది. సం||


కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

రెండు భాగములు

ఒక్కొక్క భాగం

వెల రూ. 3-8-0

పోస్టుఖర్చు ప్రత్యేకం.

ఆంధ్ర గ్రంథమాల,

మద్రాసు-1.